ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ :08.08.2024 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. లోక్ సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు 2024 ను సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం పంపింది.
2. ప్రపంచ ఆర్థిక సేవల దిగ్గజ సంస్థ చార్లెస్ స్క్వాబ్ భారత్ లో తమ మొదటి సాంకేతిక అభివృద్ధి కేంద్రం హైదరాబాద్ లో నెలకొల్పడానికి ముందుకొచ్చింది.
3. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 వెనక్కి తీసుకోవాలని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.
4. రెపోరేటును 6.5 శాతం వద్దే కొనసాగించాలని ద్రవ్య విధాన కమిటి నిర్ణయించిందని ఆర్బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ ఒక ప్రకటనలో తెలియజేశారు.
5. పొరుగు దేశం బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాట్లు అరికట్టేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పోలీసులు పలు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

**WAQF BILL:**

లోక్ సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు 2024 ను సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం పంపింది. ఈ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన తర్వాత ఈ చట్టంపై మరింత పరిశీలన కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని మైనారిటి వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజీజు అన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్యం స్పష్టంగా ఉందని ఈ చట్టంపై గోప్యంగా ఉంచడానికి ఏమి లేదని అన్నారు.

NSD

**WAQF BILL:**

అంతకుముందు ఈ బిల్లు రాజ్యాంగానికి, మత స్వేచ్ఛకు వ్యతిరేకమని పేర్కొంటూ.... కాంగ్రెస్, టిఎంసి, సమాజ్ మాది పార్టీ, డిఎంకే, ఎన్సీపి (శరద్ పవార్), కమ్యూనిస్ట్ పార్టీలు, ఇతర సభ్యులు సభలో ఈ బిల్లును అడ్డుకున్నారు. కాంగ్రెస్ సభ్యుడు కెసి వేణుగోపాలు ఈ బిల్లును ఒక నల్ల చట్టంగా సమాఖ్య వ్యవస్థపై దాడి అని ఆరోపిస్తూ సభలో ప్రవేశ పెట్టడాన్ని అడ్డుకున్నారు. ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డు పాలకమండలిలో సభ్యులుగా ఉండేటట్లు బిల్లులో నిబంధనలు చేశారని ఆరోపించారు.

**NSD**

**CENTRE:**

ప్రపంచ ఆర్థిక సేవల దిగ్గజ సంస్థ చార్లెస్ స్క్వాబ్ భారత్ లో  తమ మొదటి సాంకేతిక అబివృద్ధి కేంద్రం హైదరాబాద్ లో నెలకొల్పడానికి ముందుకొచ్చింది. కంపెని ఈరోజు డల్లాస్ లోని తన ప్రధాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, కంపెనీ సీనియర్ అధికారులు డెన్నిస్ హోవార్డ్, రామా బొక్కా, ఇతర ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. కంపెనీ హైదరాబాద్ లో నెలకొల్పడానికి  అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంలో తగిన సూచనలు చేస్తామని, కంపెనీ త్వరిత గతిన అభివృద్ధి చెందడానికి మానవ వనరులను సమకూర్చుతామని ముఖ్యమంత్రి, ఐటి శాఖ మంత్రి వారికి హామి ఇచ్చారు.

**PN**

**JAYESH:**

తెలంగాణ రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా మలచడంలో, వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి అన్ని విలువైన సూచనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్ లో రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆయన ప్రస్తుతం ముఖ్యమంత్రితో పాటు అమెరికా పర్యటనలో ఉన్నారు. ప్రభుత్వం జరిపే అన్ని ఒప్పందాలు

నిపుణుల సహాయంతో తగినంత జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే కుదురుతున్నాయని, ఇందులో ఎటువంటి అనుమానాలకు తావు లేదని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కుదుర్చుకున్న ఒప్పందాలపై బిఆర్ఎస్ ఆరోపణలు చేసిన నేపధ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు.

**PN**

**TG NEET:**

రాష్ట్రంలో ఎంబీబీఎస్ , బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33ను వెనుకకు తీసుకోమని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విషయంలో మాజీ రాష్ట్ర వైద్య శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు జోక్యం కోరుతూ ఆయనతో వారి భేటీ అయ్యారు. ప్రభుత్వం స్థానిక విద్యార్థులకు న్యాయం చేకూరేలా సమగ్రమైన విధానాన్ని రూపొందించాలని సమావేశం తర్వాత హరీష్ రావు డిమాండ్ చేశారు. ఖమ్మం, మహబూబ్ నగర్, నల్గొండ, వరంగల్, హైదరాబాద్ కు చెందిన నీట్ లో ఉత్తీర్ణత సాదించిన విద్యార్థులు తెలంగాణలో పుట్టినప్పటికి జీవో 33 కారణంగా వారు స్థానికేతరులుగా అవుతున్నారని, వారికి తెలంగాణ రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశానికి అవకాశాలు క్షీణిస్తున్నాయని అన్నారు. తెలంగాణ వైద్య విద్యార్థుల తల్లిదండ్రుల సంఘానికి చెందిన రవిప్రసాద్ మాట్లాడుతూ... తమ సొంత పిల్లలను స్థానికేతరులుగా పరిగణించడాన్ని చాలా బాధాకరమని అన్నారు.

**DESK**

**<u>దామోదర్ రాజనర్సింహ</u>**

సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. ప్రతి పేదవాడికి మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రతి ఒక్కరికి విశ్వసనీయత పెరిగే విధంగా వైద్య సేవలు అందించాలన్నారు.

పిటిసి, సంగారెడ్డి

**<u>ఏరియా ఆసుపత్రి తనిఖీ</u>**

రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు... జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లకు సంబంధించిన వార్డులను సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆమె ఆసుపత్రి అధికారులను ఆదేశించారు.

పీటీసీ, రంగారెడ్డి జిల్లా

**RBI:**

ఆర్థిక సంవత్సరం 2024-25 సంబంధించి వాస్తవ స్థూల జాతియోత్పత్తి ఎటివంటి మార్పు లేకుండా 7.2 శాతంగానే ఉండనున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంకు తన మూడవ ద్వైమాసిక ద్రవ్య విధాన కమిటి సమావేశంలో పేర్కొంది. రెపోరేటును 6.5 శాతం వద్దే కొనసాగించాలని కమిటి నిర్ణయించిందని ఆర్బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సర్దుబాటు ఉపసంహరణలపై కూడా దృష్టి కేంద్రీకరించాలని కమిటి నిర్ణయించిందని, స్థూల జాతియోత్పత్తిలో సుస్థిరత, నిలకడైన వృద్ధి, పరపతి విధానం ద్రవ్యోల్బణంపై దృష్టి సారించడానికి ఉపయోగపడిందని ఆయన అన్నారు. ఆర్థిక సంవత్సరం 2025 లో మొదటి త్రైమాసికంలో స్థూల జాతియోత్పత్తిలో వృద్ధి లక్ష్యాన్ని 7.1 శాతం నుండి 7.3 శాతానికి సవరించారు. ద్రవ్యోల్బణంలో తగ్గుదల సరళి కనబడుతుందని, మూడో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం మరింత తగ్గవచ్చని ఆర్బిఐ గవర్నర్ అన్నారు. ధరల్లో స్థిరత్వం లేకుండా స్థిరమైన వృద్ధి రేటు సాధ్యం కాదని ఆయన అన్నారు.

**NSD**

**WARANGAL:**

గత 24 గంటల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షాలు కురియడంతో చెరువులు, సరస్సులు పొంగి అనేక గ్రామాలు, పట్టణాల్లో నీరు నిలిచిపోయింది. ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలంలో అత్యధికంగా 8.2 సెం. మీటర్ల వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురియడంతో నీటి ప్రవాహాలు పొంగి పొర్లుతున్నాయి. భారీ వర్షాల కారణంగా జిల్లాలో గోదావరి నది పొంగి లోతట్టు ప్రాంతాలను వరదలతో ముంచివేసింది. పంట పొలాలు నీట మునిగి పంటలకు నష్టం వాటిల్లింది. లక్ష్మీపురం వద్ద కంకాల వాగు పులిబొందల ప్రవాహాలు పొంగి పొర్లడం కారణంగా వెంకటాపురం, మల్లాపురం గ్రామాల మధ్య రాకపోలకు అంతరాయం కలిగింది. వెంకటాపురం ఈదరపల్లి రోడ్ మీదుగా పాలెం వాగు కాల్వ ప్రవాహం ప్రవహించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ములుగు జిల్లాలోని బల్లకట్టు వాగు, జిన్నెల వాగు, కుక్కటోగు వాగు, కాలిపాక, సీతాపురం వద్ద పిల్ల కాల్వలు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం మండలంలోని ఉత్తర తాండా పంచాయితీ పరిధిలో పేసర తాండా ప్రాథమిక పాఠశాలలోకి వరద నీరు ప్రవేశించింది. బయ్యారం పెద్ద చెరువు, తూలారం ప్రాజెక్టులోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది.

**PTC, WGL**

**IMMIGRANTS:**

పొరుగు దేశం బంగ్లాదేశ్ లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఆ దేశం నుంచి అక్రమ చొరబాట్లు అరికట్టేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పోలీసులు పలు చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. బంగ్లాదేశీయులు అక్రమంగా నగరంలోకి ప్రవేశించకుండా కలకత్తా నుంచి నగరానికి వస్తున్న రైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఇంటలీజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లకు వచ్చే రైళ్లను కూడా తనిఖీ చేస్తున్నారు. గతంలో నగరంలో బంగ్లాదేశ్కు చెందిన అక్రమ వలసదారులను అరెస్ట్ చేసిన ప్రాంతాలతో సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమీషనరేట్ల పరిధిలోని బాలాపూర్, కాటేదాన్, మైలార్ దేవరపల్లి, ఫలక్ నామా,

పహాడి షరీఫ్ లాంటి ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. తమ చుట్టు ప్రక్కల ఎవరినైనా అనుమానాస్పదంగా గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని ఆ ప్రాంతాల్లో నివసించే వారికి పోలీసులు సూచించారు.

**SDP**

**<u>సంగారెడ్డి జిల్లా</u>**

యువజన క్రీడల విభాగం ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ మైదానంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి చంద్రశేఖర్ మొక్కలు నాటారు. పెద్ద సంఖ్యలో యువకులు , క్రీడాకారులు మొక్కలు నాటి , పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ... ప్రభు ప్రభుత్వ నిర్వహిస్తున్న స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో యువకులు , విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారు.

పిటిసి, సంగారెడ్డి

**<u>నిజాం కాలేజీ</u>**

హైదరాబాద్ బషీర్ బాగ్ నిజాం కాలేజీలో డిగ్రీ విద్యార్థినిలు వినూత్న నిరసన చేపట్టారు. గత ఆరు రోజులుగా గర్ల్స్ హాస్టల్ లో 100 శాతం అడ్మిషన్లు డిగ్రీ విద్యార్థినిలకే కేటాయించాలని నిరసన చేపడుతున్నారు. ఈరోజు వినూత్నంగా కాలేజీ ఆవరణలో వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. 2022 లో డిగ్రీ విద్యార్థినిల అడ్మిషన్లు తక్కువగా ఉండటం వల్ల ... పీజీ విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారన్నారు. కానీ ఈ ఏడాది డిగ్రీ విద్యార్థినిల అడ్మిషన్లు ఎక్కువ వచ్చాయని... తమకే పూర్తి స్థాయిలో అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

HYD-PTC